దత్తు వచ్చి, "అరేయ్ కవి కుమార్! 'నీ వాలుజడా—వాలు కళ్ళూ' యిల్లు ఖాళీచేసి వెళ్లిపోయిందిరా!" అన్నాడు.

నెల్లూరు దగ్గర వున్న ఏదో వూరికి కావాలని ట్రాన్స్ఫరు చేయించుకుందట. ఇంట్లో వాళ్ళెవరికీ తన ఆచూకీ కూడా తెలియనీయలేదంట. మొన్నీమధ్య వాళ్ళ నాన్న వచ్చి ఆఫీసులో వాకబు చేసేవరకు ఆమె ట్రాన్స్ఫరు సంగతి వాళ్ళకు తెలియదంట. పాపం ఆ ముసలాయన లబో దిబోమని మొత్తుకొని పోయాడని దత్తు చెప్పాడు.

అంతే, ఆ తర్వాత దమయంతి ఏమయిందో కూడా నాకు తెలియదు. ఆమె సంగతి పూర్తిగా మర్చిపోయాను కూడ. కాని, చాల రోజులవరకు నాకు గుర్తున్నదల్లా నేను రాసిన ఆ వుత్తరం గురించే.

ర ర ర

మా ఎస్వో ఆ లేడీక్లర్కును వెంటబెట్టుకుని వచ్చాడు.

ఆమెను చూచి అదిరిపడ్డాను.

ఆ సూటి ముక్కూ, ఆ పెద్ద కళ్ళూ - పాపటిలోంచి నెరుస్తూన్న జుట్టూ, శరీరంమీద వయసు చేసిన 'దాడి'....ఓ మైగాడ్, ఈమె ఎవరో కాదు....అనాటి దమయంతే!

నాలో చెలరేగే భావాలను ఏమని చెప్పను? ఎలాగో నా ఎక్సైట్‌మెంట్‌ను అణచుకుంటూ ఆమెకు సీట్ ఆఫర్ చేశా.

మా ముసలి ఎస్వో చెప్తున్నాడు—"పాపం, దమయంతమ్మ చాల మంచిది సార్! ఈ త్రాష్టుడూ, త్రాగుబోతూ ఎలా తారసపడ్డాడో గాని...."

"ఇతను చెడుగుడు ప్లేయర్ కదూ...." మాట నోరు జారింది.

ఆమె నా వంక ఆశ్చర్యంగా చూసింది. నేను సర్దుకున్నాను. "ఏ పేపర్లోనో ఫొటో చూసిన గుర్తు...."

"అవును అప్పుడు చెడుగుడు ప్లేయరే! ఇప్పుడు నా బ్రతుకుతో చెడుగుడు ఆడుతున్నాడు....ఇతని కోసమే నా మీదే ఆధారపడ్డ ముసలి తల్లిదండ్రులనూ, చెల్లెళ్ళనూ, తమ్ముళ్ళనూ అన్యాయంగా అర్ధంతరంగా వదిలేశాను. దిక్కులేని పక్షులను చేశాను. వాళ్ళు చెట్టుకొకళ్ళు, పుట్టకొకళ్ళు అయ్యారు. ముసలితనంలో రోగాలకు మందులేక, ఆకలికి తిండిలేక అమ్మా నాన్నా చనిపోయారు. వయసులో వున్న చెల్లెళ్ళు తెగిన గాలిపటాలయ్యారు. పెద్దది పడుపు వృత్తిలోకి దిగింది. చిన్నది కాలు జారింది. మోసపోయి ఆత్మహత్య చేసుకుంది. తమ్ముళ్ళు గాలివెధవలయిపోయి ఎటెటో పోయారు...." కన్నీళ్ళు వత్తుకుంటూ తన గుండెల్లోని బాధంతా చెప్పింది.

"మరి మీ మీదే ఆధారపడ్డ మీ వాళ్ళను ఎందుకు వదిలేశారు?" వెధవ ప్రశ్న వేశాను.

"సుఖపడిపోదామని; జీవితంలోని ఆనందమంతా జుర్రుకుందామని...."

కొన్ని క్షణాలు మౌనంగా వున్నాక తనలో తాను గొణుక్కుంటున్నట్లుగా అంది:

"....అసలు ఆ పాడు వుత్తరం చేసింది.... నన్ను మైకంలోకి దించింది. ఇదిగో ఈ మహానుభావుడ్ని కలిపింది. నిశ్చింతగా బ్రతుకుతున్న నా బ్రతుకులో భూకంపాలను సృష్టించింది. నా వాళ్ళను నాకు కాకుండా చేసింది. చెట్టుకొకళ్ళు పుట్టకొకళ్లు చేసింది...." పమిట చెంగుతో కళ్ళు తుడుచుకుంది.

కొన్ని క్షణాలు బరువుగా గడిచేక "సారీ సార్! అనవసరంగా మీ టైం వేస్టు అయింది" అని లేచి నిలబడింది.

"మీకు పిల్లలు...."

విరక్తిగా నవ్వింది.


"సార్, వీళ్ళ తమ్ముడికి మన ఆఫీసులో ప్యూను వుద్యోగం కోసం అప్లికేషన్ పెట్టుకుంది. మీరు దయతలచి...." మా ఎస్వో పాపం జాలిగుండె మనిషి.

"అందరూ మట్టికొట్టుకుపోగా ఆఖరువాడ్ని మాత్రం చేరదీశా. తమ్ముడయినా కొడుకయినా వీడే! రేపు నాకు కొరివి పెట్టేవాడూ వీడే! వాడికి మీరు వుద్యోగం యిప్పిస్తే మీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను సార్!" అంది.

అవును. ఆమెకి నేను చేసిన మేలు ఈ జన్మలో మరిచిపోలేదు. □



# ఎక్సిడెంట్



'మురళీధర్'

ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం ఆడపెళ్ళివారిల్లులా సందడిగా కళకళలాడుతుంది. గుంటూరు-హైదరాబాద్ రూట్‌లో క్రొత్తగా ప్రవేశపెట్టబడిన తాతావారి 1210-ఇ సూపర్ ఎక్స్‌ప్రెస్ 'మైడెన్ రన్'కు సిద్ధంగా వుంది. ట్యూబ్ లైట్ల కాంతిలో, తెలుపు కాషాయ రంగులలో మెరిసిపోతున్న బస్సు, క్రొత్త పెళ్ళికూతురు పెళ్లై అత్తవారింటికి బయలుదేరుతున్నట్టుంది. విండ్ స్క్రీన్స్‌కు ఆర్చీలుగా అలంకరణ చేసిన ఎరుపు, పసుపు, నీలం బల్బులు, నూతన వధువు మంగళసూత్రాలులా మెరుస్తున్నాయ్. పైసగం బ్లాక్ పెయింట్‌తో కవర్ చేసిన హెడ్‌లైట్లు, సిగ్గుతో క్రిందకు వాలిపోతున్న వధువు కనురెప్పలులా వున్నయ్. రెండు వైపులా చివరగా, ఆరుతూ, వెలుగుతున్న ట్రాఫిక్ ఇండికేటర్స్ మధ్యమధ్య క్రీగంట చూస్తున్న పెళ్ళికూతురు వాలుచూపులులా వున్నయ్. ప్రక్కల. వెనుకవైపు వున్న ఏటి

రంగు తెరలు, వధువు జలతారు మేలిముసుగులా కదుల్తున్నయ్. నల్లని క్రొత్త 'గుడ్ ఇయర్' టైర్లు మొదటిసారిగా నేలను తాకుతున్న ఓ అందాల సుందరి పాదాలులా వున్నయ్. అటు, ఇటు వున్న విశాఖపట్టణం, తిరుపతి, భద్రాచలం, కడప, కర్నూలు మొదలగు ఎక్స్‌ప్రెస్‌లు పెండ్లికూతురుకు వీడ్కోలు ఇవ్వడానికి సిద్ధంగావున్న పెళ్ళై కాపురాలు చేసుకుంటున్న స్నేహితురాండ్రుగా ఉన్నయ్.

బస్సు బయలుదేరటానికి ఇంకా పది నిముషాలుంది. షెడ్యూలు టైము తొమ్మిదిన్నరకైనా, మొదటి ట్రిప్ కనుక తొమ్మిదుమ్పైతొమ్మిదికి బయలుదేరుతామని, అప్పుడు వర్జ్యంలేని మంచి ఘడియలని డ్రైవరు సుబ్బారావు చేసిన రిక్వెస్టును కాదనలేదు డి.యమ్.- తనకు అంత నమ్మకం లేకపోయినా! డి.ఎమ్. గారు డైరెక్ట్ రిక్రూట్.ఇరవై ఐదు సంవత్సరాల పూర్ణయవ్వనంలో వున్నారు. వారు ఎకనమిక్స్ ఎం.ఏ. ఫస్టు క్లాసులో యూనివర్సిటీ ఫస్టుగా వచ్చారు. వారు ఛార్జ్ తీసుకొని కొద్దిరోజులే ఐంది. వారి హిస్టరీ యింకా బాగా తెలియనందున స్టాఫ్ ఒళ్ళు దగ్గర పెట్టుకుని పని చేస్తున్నారు. వారు మాటలు వాడటంలోగూడా- ఆఫీసులో-పొదుపుగా వుంటారు. వారు అలా మార్క్స్‌లిస్ట్ ప్రొవిజనల్ సర్టిఫికేట్ తీసికొని, యిలా రాష్ట్ర కాబినెట్‌లో ఫైనాన్స్ మినిష్టర్ గారి ఏకైక గారాబు పుత్రిక-సుజాత ఎం.ఎస్.సి మెళ్ళో మూడు ముముళ్ళు వేసి-ఇలా అదే చేత్తో—ఆ మూడుముళ్ళు వేయడంలో ప్రాముఖ్యం వహించిన కుడిచేత్తో డి.యం. గా అప్పాయింట్‌మెంట్ ఆర్డరు తీసుకొని జాయినయ్యారు. మొదటిసారి సంక్రాంతి పండుగకు హైద్రాబాద్ అత్తవారింటికి (అత్తగారు కాబినెట్ మినిష్టరు కాకపోవచ్చు-కాని చీఫ్ మినిష్టర్ గారితోనైనా వాదించి తన పాయింటుకు ఆయనను ఒప్పించే ఒకేఒక వ్యక్తి ఫైనాన్స్ మినిష్టరుగారైనా, భార్య దగ్గర వారు ఎప్పుడూ "యస్ మాడమ్" అంచేత మరి అత్తగారు ఎక్కువ పవర్‌ఫుల్) సతీసమేతంగా బయలుదేరారు.


ఇరవై రెండేళ్ళ సుజాత, రెండువైపులా జరీబార్డరు, బుటావు ఉన్న ఆకుపచ్చ కంచిపట్టు చీరలో పూర్ణస్త్రీత్వంతో మెరిసిపోతోంది. మెడలో ఎర్రరాళ్ళ నెక్లెస్, చేతులకు ఎర్రరాళ్ళ గాజులు, చెవులకు ఎర్రరాళ్ళ దుద్దులు, చిటికెన వ్రేలికి ఎర్రరాళ్ళ ప్రధానపుటుంగరం—వచ్చటి ఫాలభాగంపై ఎర్రని కుంకుమ బొట్టు, గాలికి ఎగురుతున్న జుట్టు, పెద్ద 'వి' నెక్‌తోవున్న ఆకుపచ్చ జాకెట్, పిరుదలదాకావున్న జడ, జడలో మల్లెలు కనకాంబరాలు-డి.యమ్.గారి ప్రక్కన ఒక అంగుళం తక్కువగా, చూచేవారికి సమానంగా ఎత్తు కనపడుతూ, చేతులు కట్టుకొని ఠీవిగా, హుందాగా, మహారాణీలా, నూరు నయాపైసాల ఆంధ్ర ఆడపడుచులా వుంది—సుజాత.

"స్టార్ట్ కాటోయే ముందు కొబ్బరికాయ కొడుతున్నారా?" అధికార స్వరంతో అడిగింది.

"అమ్మా! తప్పకుండానమ్మా! రెండు కొబ్బరి కాయలు, అరడజను నిమ్మకాయలు తెచ్చానమ్మా! ఓ రెండు నిమ్మకాయలు ముందు టైర కింద పెట్టేను. ఓ నాలుగు రేడియేటర్ గ్రిల్‌కు కడతానమ్మా! అయ్యగారు కొడతారేమో అడుగుదామనుకుంటున్నా! మీరు వస్తున్నారు. ఓ కాయ మీరు కొట్టండమ్మా! నేను ఓ కాయ కొడతాను. ముందు మీరు కొడితే శుభంగా వుంటుందమ్మా" వినయంగా అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావు కొత్త యూనిఫాం, టోపీలో హుందాగా వున్నాడు. వయస్సు యిరవై ఎనిమిది. బి. ఎ. పాసై ఉద్యోగం వెంటనే దొరకనందున డ్రైవింగ్ నేర్చుకొని ఆర్. టీ. సి. లో చేరాడు. ఎప్పుడూ స్టీరింగ్ తిప్పే చేతులు మోటుగా, బలంగా వున్నాయి. ఈ మధ్యనే ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌గా చేస్తున్నాడు. మొదటిసారిగా కొత్తబస్సు ఎక్కబోతుంటే ఏదో థ్రిల్‌గా వుంది. మనిషి ఎంత కరుకుగా కనబడతాడో మాట, మనసు అంత మెత్తన. ప్రొద్దున్నే పూజ చేసుకొని వెంకటరమణుడికి






భక్తితో నమస్కరించి, భార్య ముఖం చూసి, ఐదేండ్ల కొడుకును ముద్దాడి భార్య యిచ్చిన కేరియర్ తీసుకొని డ్యూటీకివస్తాడు. ఆ రోజు శనివారం. ప్రొద్దున్నే పూజ చేసుకొని, రాత్రి వుపవాసం కనుక పర్మిషన్ తీసుకొని ఇంటి దగ్గరే భోంచేసి డ్యూటీకి వచ్చాడు. కనుబొమల మధ్య కుంకుమబొట్టు, చెవిలో పూజ చేసిన పూలతో, తలపై టోపీతో క్రొత్తగా కనబడుతున్నాడు సుబ్బారావు.

కండక్టర్ శామ్యూల్ టికెట్స్ చెక్ చేస్తున్నాడు. తతంగాన్నంతా సుబ్బారావుకే వదిలేసి పని చూసుకుంటున్నాడు.

ప్రయాణీకులు కొందరు ప్లాట్‌ఫాంపై నుంచున్నారు. ఎక్కువమంది తమ నంబర్ల ప్రకారం సీట్లలో కూర్చున్నారు.

నాల్గవ వరుసలో టు సీటర్ పె కిటికీ ప్రక్కగా కూర్చున్నాడు శ్రీనివాసమూర్తి.

పరంధామయ్యగారు, సీతమ్మగారు బస్సు ప్రక్కన నిలబడి ఏమేమో మాట్లాడుతున్నారు. జాగ్రత్తలు చెబుతున్నారు! ముగ్గురి కళ్ళల్లో అంతులేని తృప్తి.

"బాబూ శ్రీనూ! ఆ అపాయింట్‌మెంట్ ఆర్డరు జాగ్రత్త! ఏదో ఆ వెంకట రమణుడు కరుణించి ఇన్నాళ్ళకు ఓదారి చూపాడు. హైద్రాబాద్ వెళ్ళగనే మావయ్యగారింటికి వెళ్ళు. వాడు సంతోషిస్తాడు. వెంటనే చేరగానే వుత్తరం రాయి" శ్రీనివాసమూర్తి చేయి ఆప్యాయంగా నిమురుతూ అన్నారు పరంధామయ్యగారు.

"సూట్‌కేస్‌లో ఫోల్డర్‌లో పెట్టాను. మీరు ఇద్దరూ బిక్కు బిక్కుమంటూ ఇక్కడ ఎందుకు? మావయ్య సహాయంతో ఓ చిన్న ఇల్లు అద్దెకు సంపాదించి, నేను వచ్చి మిమ్మల్ని తీసికెళ్తాను. మీ పెన్షన్ కూడా అక్కడికే వచ్చే ఏర్పాటు చేసుకోవచ్చు. పల్లెలో ఆ ఎకరం అమ్మేసి ఏ బ్యాంకులోనో ఫిక్సెడ్ వేస్తే అవస

రానికి వుంటుంది. జాబ్ పర్మనెంట్ అయితే ఇల్లు కట్టుకోడానికి లోన్ ఇస్తారుట-మా ఆఫీసు వాళ్ళు. ఎలాగో ఓ చిన్న యిల్లు కట్టుకుంటే ఓ భాగం అద్దెకిచ్చి" శ్రీనివాసమూర్తి మనోవీధిలో రంగుల హరివిల్లు వెలిసింది.

"అంతా వాడి దయ" అన్నట్లు చేతులు పైకెత్తి నమస్కరించారు పరంధామయ్యగారు.

"నీవు కాస్త నిలదొక్కుకుంటే మావయ్య కూతురు పద్మావతితో ఆ మూడుముళ్లు ఆ ఏడుకొండలవాడి సన్నిధిలో వేయిస్తే మా బాధ్యత పూర్తవుతుంది.... ప్రయాణంలో జాగ్రత్త నాయనా! నీ వన్నట్లు మేము కూడా నీతో వుంటే రామా కృష్ణా అంటూ కాలం వెళ్ళదీస్తాం. మీ నాన్నగారికి అరవై అయిదు దాటినయ్, చూపు ఆనటంలా! ముసలితనంలో నిన్ను మాకు ప్రసాదించి ఆ భగవంతుడు ఓ దారి చూపాడు," ఎన్ని నోములు నోచినా సంతానం కలగక ఇహ కలగరని నిరాశ పరచుకొన్న తన నలభై ఒకటవ సంవత్సరంలో పుట్టిన శ్రీనివాసమూర్తిని చూస్తూ అంది సీతమ్మగారు. శ్రీను మాట్లాడలేదు. అతని మనసు పద్మావతి దగ్గర వాలింది.

'త్రీ సీటర్' ఐదవ వరుసలోనున్న శ్రీకాంత్ నళిని తమ నెంబర్లు చూసుకొని కూర్చున్నారు. కిటికీ ప్రక్కగా వారిని పంపడానికి వచ్చి, అప్పటిదాకా వారితో క్రిందే మాట్లాడిన స్నేహితులు గుమిగూడారు.

"ఏయ్ నళినీ! ఆఫీసుకు మీరు పెట్టిన సెలవు పది రోజులని గుర్తుంచుకో. మీవారి మత్తులో బడి గంటలు నిమిషాలుగా, రోజులు గంటలుగా గడుపుతూ పది రోజులు పది గంటలనుకొని మర్చిపోవాకు మీ ఆనందంలో" అసూయగా అంది అనసూయ.

కొత్త పెళ్ళికూతురు నళిని సిగ్గుతో చురుక్కున చూసింది.

"మా శ్రీకాంత్ గుర్తు చేస్తాడులెండి! వాడికి డ్యూటీ ఫస్ట్" సర్దాగా అన్నాడు రాజు.

శ్రీకాంత్ నళిని వర్ణాంతర వివాహం చేసుకున్నారు. ఇరువైపులా పెద్దలు ఒప్పుకోనందున ఆఫీసరు తదితర మిత్రబృందం పెద్దరికం వహించి వారి పెళ్ళి చేశారు. ఒకరోజు సి.ఎల్. గ్రాంట్ చేయడానికి యక్షప్రశ్నలు వేసి వేధించే 'యములాడు' అడక్కుండునే — ఇద్దరకూ హనీమూన్ ట్రిప్‌కు పదిరోజులు లీవ్ శాంక్షన్ చేశాడు.

స్నేహితుల ఛలోక్తులకు చిరునవ్వే సమాధానంగా యిస్తున్నాడు శ్రీకాంత్.

'టు సీటర్'లో ఆరవ సీటులో కూర్చున్న వసుమతికి కళ్ళు నిండుగా నీళ్ళున్నాయ్. అక్కాబావ ఏకాంతంగా (అంతమందిలో కూడా) మాట్లాడుకోడానికన్నట్లు, వసుమతి తమ్ముడు సుధాకర్ క్రిందనే వున్నాడు.

"యూ సిల్లీ! చిన్నపిల్లలా ఆ కన్నీళ్ళేవిటీ! నేను అప్పుడప్పుడూ వస్తూ వుంటాను. నాకు మాత్రం సంతోషంగా వుందా! అసలు తొమ్మిది వచ్చింతరవాత తీసికెళ్ళమంటే మీ బామ్మదంతా హడావిడి "మొదటి కాన్పు సీమంతం చెయ్యాలి—ఏడోనెలలో కూడా ఆలస్యమే" అని పట్టుబట్టింది. ఏమైనాసరే! నాకు మాత్రం పాపాయి కావాలి" కిటికీలో గుండా చేతిని నిమురుతూ అన్నాడు కోటేశ్వరరావు.

"పాపం! ఆశ! అంతా మీ యిష్టమే!" అంటూ వెక్కిరించి నవ్వింది. వానలో ఎండ కాసినట్లుంది.

"సార్! అంతా ఎక్కండి! బయలుదేరుదాం!" అన్న శ్యామూల్ హెచ్చరికతో అంతా ఎక్కారు. ఆఖరుసారిగా వీడ్కోలు ఇస్తున్నారు. "ఉంటాం" అంటున్నారు. జాగ్రత్తలు చెబుతున్నారు. వెళ్ళగానే ఉత్తరాలు వ్రాయమంటున్నారు. సిగరెట్ రాయుళ్ళు ఆఖరి పీల్పు పీల్చి బట్‌ను బూటు (చెప్పు) కాలితో రుద్ది ఎక్కుతున్నారు.


సుబ్బారావు తన పొట్లాలతో తీసికొచ్చిన పసుపు, కుంకుమ ముందువైపు రాసి బొట్లు పెట్టాడు.

కంట్రోలర్, ఇతర ఉద్యోగస్థులు డి.ఎమ్. గారితో వినయంగా చేతులు కట్టుకుని మాట్లాడుతున్నారు.

"అమ్మా! మీరు టెంకాయ కొట్టండి" వినయంగా యిచ్చాడు డ్రైవర్ సుబ్బారావు.








డి.యమ్.గారి వైపోసారి చూసి, బస్సు ముందుకు నడిచింది సుజాత.

అంతా మాటలు ఆపి ఎక్కడలేని గౌరవంతో చూస్తున్నారు.

ఒకే దెబ్బకు సరిగ్గా సగానికి పగిలింది కాయ.

సుబ్బారావు కళ్ళల్లో భక్తి కనబడింది.

కాయ తీసికొని కళ్ళు మూసుకొని యేదో తలచుకొని బస్సుచుట్టూ ముందువైపు తిప్పి కొట్టాడు.

ఎవ్వరివైపు చూడకుండా బస్సు యెక్కి డోర్ వేశాడు.

డి.యమ్.గారు ముందున్న సింగిల్ సీట్లో కూర్చున్నారు. వారి సతీమణి 'టు సీటర్'లో మొదటి సీటుపై కిటికీ ప్రక్కన కూర్చున్నారు.

కండక్టర్ శ్యామూల్ నించుకున్నాడు.

సరిగ్గా తొమ్మిది ముప్పై ఎనిమిది.

నల్లగా తళతళ మెరిసిపోతున్న స్టీరింగుపై కుడిచేయి వేశాడు. ఏదో వింత అనుభూతి కలిగింది సుబ్బారావుకు.

"సార్!" డి.యమ్‌గారి వైపు చూశాడు అనుమతికోసం.

డి.యమ్‌గారు ఒక్కసారి వెనక్కు తిరిగి కలయ చూసి, "రైట్, పోనివ్" అన్నాడు.

గేర్ న్యూట్రల్‌చేసి, గడియారం చూసి, తొమ్మిది ముప్పై తొమ్మిదికి 'స్టార్ట్' చేసి, హెడ్ లైట్స్ ఆన్ చేసి, క్లచ్ నొక్కి ఫస్టుగేర్ వేసి నెమ్మదిగా యేక్సిలేటర్ ఇస్తూ క్లచ్ రిలీజ్ చేశాడు సుబ్బారావు మెత్తగా. రెండు నిమ్మకాయల్ను నలిపేస్తూ కదిలింది క్రొత్త హైద్రాబాద్ సూపర్ ఎక్స్‌ప్రెస్.

$ \quad $ $ \quad $ $ \quad $

సెకండ్ గేర్‌లో 'స్టాండింగు' దాటింది. థర్డ్ గేర్‌లో ఊరు దాటి, మెత్తగా నల్లని తారు రోడ్డుపై జారిపోతోంది ఎక్స్‌ప్రెస్.

డి.యమ్.గారికి తన 'డ్రైవింగ్ స్కిల్' చూపించటానికా అన్నట్లు కుదురులేకుండా డ్రైవ్ చేస్తున్నాడు సుబ్బారావు. 'బ్రాండ్ న్యూ' కావటంవల్ల రౌతు మనసు నెరిగి పరిగెత్తే ఉత్తమాశ్వంలా సుబ్బారావు మనసు నెరిగి పరిగెత్తుతుంది ఎక్స్‌ప్రెస్. అలా యేక్సిలేటర్‌పై కాలు వేస్తే మెత్తగా అందుకునే 'పికప్'తో అరవై డెబ్భై కిలోమీటర్ల వేగంతో పోతోంది.






బస్. బ్రేక్ పెడల్‌పై కాలు అనిస్తే సెకం డ్లలో ఇరవై కిలోమీటర్ల స్పీడుకొచ్చి ఏ మాత్రం కుదుపులేకుండా ఆగుతుంది. ఇంజన్ శబ్దంతప్ప ఏ ఇతర శబ్దాలు లేనందున ప్రయా ణము అందరికీ ప్రశాంతంగా వుంది. టర్నిం గులు కట్ చేస్తూ ముందుపోతన్న వెహి కిల్స్‌ను ఓవర్‌టేక్ చేస్తూ 'జర్క్' లేకుండా ఎనభై కిలోమీటర్లలో అతినైపుణ్యంగా డ్రైవ్ చేస్తున్నాడు సుబ్బారావు.

పుచ్చపువ్వులాంటి త్రయోదశి వెన్నెల. చలిగాలి సగం దించిన గ్లాసెస్‌గుండా ప్రయా ణీకుల్ని పలకరించి చక్కిలిగింతలు పెడు తుంది.

శ్రీనివాసమూర్తికి రాత్రిపూట వెన్నెలలో వేగంగా వెనక్కుపోతున్న చెట్లు, టెలిగ్రాఫ్ స్తంభాలు, చిన్న ఊళ్ళు చూస్తూ, ఆలోచిస్తూ దూరప్రయాణం చెయ్యడం ఎంతో యిష్టం.

"మర్నాడు ఆదివారం. తను పద్మతో ఆనం దంగా గడపొచ్చు. సోమవారం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వారి ఆఫీసులో జాయినవుతాడు. పద్మతో రామకృష్ణ 70 యం.యం.లో సినిమా, ఏదైనా ఏ.సి. హోటల్‌లో డిన్నరు చేయాలి! అమ్మా, నాన్న, తను, తద్మా—స్వంత యిల్లు-తమకో బుజ్జిబాబు-అమ్మే చూసుకుంటుంది - తను హాయిగా పద్మతో-సినిమాలు ఓహ్! జీవితం ఎంత మధురం!"

శ్రీకాంత్ నళిని నడుంచుట్టూ చెయ్యివేసి దగ్గరగా వత్తుకున్నాడు.

లైట్లు ఆర్పివేశాడు సుబ్బారావు సిటీ దాటం గానే. నళిని దగ్గరగా జరిగింది. చలిగాలి వారి శరీరాలలో వేడి పుట్టించింది.

"ఐదింటికి, తెల్లవారకముందే 'ద్వారక'లో మన రూంలో వుంటాం" గుసగుసలాడేడు శ్రీకాంత్.

"కాఫీ తీసికొని ఎక్కడికి వెళదాం?" నళిని ప్రశ్న.

"వెళ్ళేదెక్కడికి? భోజనం టైము దాకా రూంలోనే ఇద్దరం.... కలిసి.... నిద్రపోదామా?" కొంటెగా అన్నాడు.

"అబ్బ పోండి! ఎవరైనా వింటారు" కొన్ని గంటలలో తను శ్రీకాంత్‌తో పంచుకునే అను భవం ఊహించుకుంటూ పారవశ్యంలో మునిగి పోయింది నళిని.

సుధాకర్ ఇంటి దగ్గర కబుర్లు చెబుతుంటే పరధ్యానంగా వింటూ వుంది వసుమతి.

ధ్యాస కోటేశ్వరరావు మీద వుంది.

"పాపం ఒక్కరు ఏం తిప్పలు పడతారో! హోటల్ భోజనం పడదు. ఒండుకు తినా ల్సిందే! ఎంత మంచివారు! తనకన్నా కోపం వస్తుంది కాని ఆయన అలా కాదు. నిజంగా పాప పుడితే ఎంత సంతోషిస్తారో! ఓ రెండు నెలలలో తను పాపతో వుంటుంది. ఆయన వస్తారు యేదో అంటారు! తను సిగ్గుపడు తుంది."

మనోఫలకంపై టెక్నికలర్‌లో చూస్తున్న దృశ్యం "అక్కా! బావ ఎప్పుడొస్తానన్నారే?" అన్న సుధ మాటలతో చెదిరిపోయింది.

మాచర్ల లైట్లు దూరంగా కనబడుతున్నయ్.

పదకొండు మ్కాప్పావుకు స్టాండింగ్‌లో ఆగింది ఎక్స్‌ప్రెస్. డి.యమ్.గారు రేడియం డయల్ చూశారు.

సుబ్బారావువైపు మెచ్చుకోలుగా చూశారు.

"వెల్‌డన్! దాదాపు నూట ఇరవై కిలో మీటర్లు రెండు గంటల ఐదు నిమిషాలు."

సుబ్బారావు వినయంగా తల వంచు కున్నాడు.

"టీ తీసికోండి సార్!" రెండు కప్పులతో వచ్చాడు శామ్యూల్.

చాలా మంది టీ తాగడానికి దిగారు.

పది నిమిషాలుండి సుబ్బారావు ఎక్కి ఎయిర్ హారన్ మ్రోగించాడు.

డి.యమ్‌గారు సతీమణి సుజాత ప్రక్కన కూర్చున్నారు. శామ్యూల్ సింగిల్ సీట్‌కు మారాడు.

డ్రైవరు అక్కడ మారవలసి వున్నా— ఏదో కారణం వలన సుబ్బారావునే వెళ్ళ మన్నారు.

అద్దాలు పూర్తిగా దించారు చలిగాలికి ...లేక. అంతా తమ సీట్లపై కూర్చున్నారు.

మాచర్ల లైట్లు వీడ్కోలు చెప్పినయ్.

టాప్‌గేర్‌లో ఇంజను మెత్తని శబ్దం జోల పాటలా వుంది.

సుజాత డి.యమ్.గారి కాళ్ళపై తలపెట్టి పడుకుంది. వారిచెయి సుజాత మెత్తని నడుమును తాకుతుంది. శ్రీనివాసమూర్తి ముందు సీటుకు దిండు ఆనించి తలపెట్టి పడుకున్నాడు.

నళిని శ్రీకాంత్ భుజంపై వ్రాలిపోయింది.

ఎవరికి వీలున్నట్లు వారు నిద్రకుపక్రమించారు-సుబ్బారావు తప్ప.

శామ్యూల్‌ను అగ్గిపెట్టె అడిగాడు.

నిద్రమత్తులోనే ఇచ్చాడు.

సిగరెట్ ముట్టించి అగ్గిపెట్టె ఇచ్చాడు సుబ్బారావు. 'కాష్‌బాగ్' ఒళ్ళో పెట్టుకొని నిద్రపోయాడు శామ్యూల్. లోపల అంతా చీకటి. సుబ్బారావు నోట్లో సిగరెట్ యెర్రగా మెరుస్తుంది.

"లక్ష ముప్ఫైవేలు పైనచేసే కొత్తబండి డి. యం. గారు, వారి మిసెస్! యాభైమంది ప్రయాణీకులు, అందరి భద్రతా తన చేతుల్లో వుంది."

ఒక్కసారి భార్య లక్ష్మి, పిల్లవాడు గుర్తుకొచ్చారు. "ఏం చేస్తుంటారో! హాయిగా నిద్రపోతుంటారు. నిద్రలో అమాయకంగా వుండే లక్ష్మి ముఖం, నవ్వుతుండే బాబు" సుబ్బారావు నవ్వుకున్నాడు.

ఎక్కడా జన సంచారం లేదు. ఒకటీ అరా నైట్ ఎక్స్‌ప్రెస్‌లు, లారీలు.

వాతావరణంలో ఎక్కడా చైతన్యం లేదు. సద్దుల! సాగర్ ఘాట్ సెక్షన్ వస్తోంది.

తనకు తెలియకుండానే ఎక్కువ స్పీడు పోతున్నానని గ్రహించి ఏక్సిలేటర్ పై కాలు తీసేశాడు. స్పీడోమీటర్ ఇండికేటర్ వెనక్కి తగ్గసాగింది.

"ఘాట్ సెక్షన్ హెయిర్ పిన్ బెండ్స్- ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా— ఇంతే సంగతులు."

సుబ్బారావు సర్దుకొని కూర్చున్నాడు.

టర్నింగ్స్‌లో లైట్ అఫ్ చేస్తూ, ఆన్ చేస్తూ ఇంకా జాగ్రత్త కోసం హారన్ ఇస్తున్నాడు. మెత్తగా, పర్‌ఫెక్టుగా తిరుగుతుంది స్టీరింగు. ఏమయినా ప్రమాదం జరుగుతుందేమోనన్నట్లు తెల్లటి హెడ్‌లైటు కాంతికిరణాలు రోడ్డును స్పష్టంగా కనబడేటట్లు చేస్తున్నాయ్.

"అదిగో ఆ అప్ ఎక్కి, అ హెయిర్‌పిన్ బెండ్ తిరిగితే ఫరవాలేదు. అయినా ఎన్నిసార్లు రాలేదు! ఏవిటో ఎప్పటి కప్పుడు కొత్తగనే వుంటుంది" అప్ ఎక్కింది ఎక్స్‌ప్రెస్.

ఓ వైపు కొండ అంచు! ఓ వైపు లోయ. లోయవయిపు చిన్న గోడ!

లైట్లు డిమ్‌చేస్తూ, హారన్ యిస్తూ కొండ అంచును చుట్టిన హెయిర్‌పిన్‌బెండ్‌పై స్టీరింగ్ కట్ చేస్తున్నాడు సుబ్బారావు.

అంతే!

ఒక్కసారిగా కాంతి సుబ్బారావు కళ్ళల్లో పడి మిరుమిట్లు గొలిపింది.

క్షణంలో, సగంలో కళ్ళు చికిలించుకొని చూశాడు. తను పూర్తిగా టర్నింగ్ తిరిగే లోపల్నే ఎదురుగా లేలెండ్.

"అరె! అదేవిటి? స్పీడు తగ్గించడు! బ్రేక్ వెయ్యడు? అరెరె! రైట్‌మార్జిన్‌కు వస్తాడేమిటి! తను? ఎటు? లెఫ్టనకొండ!వచ్చేశాడు" సుబ్బారావు లెఫ్టుకు కట్ చేశాడు.

ధన్!


"అమ్మో! అబ్బా! ఏవండీ! ఎక్కడున్నారు? ఒరేయ్ సరసూ! నళినీ! అయ్యమ్యో! ఏదో వత్తేస్తుంది-వోరి నాయనో! నా గుండెల మీద ఈ బరువు....సుజా....సుధా...."

అయిపోయింది.

* * *

ఓ నిముషంలో అంతా అయిపోయింది.

కొండ అంచును ఢీకొని లెఫ్టుసైడు సగంకుపైగా నుగ్గు నుగ్గయిపోయింది ఎక్స్‌ప్రెస్. కుడివయిపు లేలెండ్‌పైనున్న ఐరన్ షీట్స్ కోసుకొని చివరిదాకా చీలికలయి పోయింది. ఎదురుగా నున్న పెద్ద బండరాయికి గుద్దుకొని ఇంజను లోపలకి పోయి ముందు భాగం ఎందుకు పనికిరాకుండా పోయింది లేలెండ్‌కు.




మనుష్యులు, వస్తువులు చెల్లాచెదురుగా పడిపోయారు. మూలుగుతున్నారు. అరుస్తున్నారు. కొంతమందికి అరవటానికి అవసరం లేనట్లు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

కాళ్ళు విరిగినవాళ్ళు, చేతులు తెగినవారు, తలలు పగిలినవారు, పొట్టలు చీరుకుపోయిన వారు—అంతా భీభత్సం. ఆ వెన్నెల వెలుగులో ఏవీ స్పష్టంగా కనబడటం లేదు.

ఎక్స్‌ప్రెస్‌కు కొంచెం వెనుకగా వస్తున్న ఎంబాసిడర్ వచ్చి ఆగింది.

కారులో వారు పరిస్థితి చూసి సాగర్‌కు వెళ్ళటానికి వీలులేనందున మాచర్ల వెళ్ళి డిపోలో చెప్పారు. ఫ్లడ్‌లైట్స్‌తో రిలీఫ్‌పార్టీ వచ్చింది.

ఆ ప్రాంతమంతా లైట్లతో పట్టపగలులా వుంది. సీట్ల క్రింద ఇరుక్కుపోయినవారు, హెడ్ ఆన్ కొలిజన్‌లో ఎగిరి దూరంగా పడ్డవారు, బస్సు లారీ రెంటిమధ్య ఇరుక్కున్నవారు—అందరినీ జాగ్రత్తగా బయటకు తీస్తున్నారు.

డి. యం. గారి తల ముఖం గుర్తుపట్టలేనట్లుగా నలిగిపోయింది. వారి సతీమణి ఎర్రటి బొట్టు రక్తంలో కలిసిపోయింది. నిద్రలో భర్త చేతిని పట్టుకున్న చెయ్యి అలాగే వుంది. సీటు మధ్యలో పడి నలిగిపోయింది సుజాత.

ఇద్దర్నీ ఒక ప్రక్కగా పడుకోబెట్టి గుడ్డ కప్పారు! శ్రీనివాసమూర్తి ఎగిరి బండలమీద పడ్డాడు. తల పగిలి రక్తం ప్రవాహం ఐంది.

సూట్‌కేసులోనుండి బయటపడిన ఆర్డరు ముళ్ళకంపలో చిక్కుకుంది.

ఉద్యోగంలో చేరిన కొడుకు దగ్గర నుండి వుత్తరం వస్తుందని ఎదురుచూసే పరంధామయ్య సీతమ్మలు కొడుకు శవాన్ని చూడవలసివస్తే వారి స్థితి వర్ణించ నెవరి శక్యం? వృద్ధాప్యంలో కొడుకు అసరాతో జీవితాన్ని వెళ్ళబుచ్చుకుంటామని కలలు కన్నవారిని

ఎవరు ఎలా ఓదార్చగలరు?

శ్రీకాంత్‌కు రెండు కాళ్ళూ ఫ్రాక్చర్ అయినవి.

ప్రక్కనే వున్న నళిని దగ్గరకు అంత బాధలోనూ దేక్కుంటూ వెళ్ళాడు.

మరో ఐదారు గంటలలో శ్రీకాంత్‌తో స్వర్గసౌఖ్యాలనుభవించవలసిన నళిని నిర్జీవంగా పడుంది.

శ్రీకాంత్ చిలిపిగా చేసే చేష్టలకు గుర్తుగా నఖక్షత, దంతక్షతాలు, వుండవలసిన చెక్కిళ్ళు పెదాలు, రేకులచే నిర్దాక్షిణ్యంగా చీల్చబడ్డయ్.

శ్రీకాంత్ కౌగిలిలో పరవశం చెందవలసిన అందమయిన ఇరవై మూడేండ్ల శరీరం రక్తంతో తడిసి, ఓ చెయి తెగి దూరంగా పడి వుంది. పదిరోజుల హనీమూన్ ట్రిప్ పది గంటలు కూడా పూర్తి కాకుండా ముగిసింది.

శ్రీకాంత్ తల తిప్పుకొని చేతులలో కప్పుకున్నాడు. కొద్ది దెబ్బలతో బయడపడ్డవారిలో సుధాకర్ ఒకడు. నిద్రకు ఆగలేక, బ్లాంకెట్ బస్‌ఫ్లోర్‌పై రెండు సీట్ల వరసల మధ్య పరచి పడుకున్నాడు.

శబ్దానికి ఉలిక్కిపడి లేచాడు.

అక్క వసుమతిని వెతుక్కుంటూ వచ్చాడు.

ముఖం గుర్తుపట్టలేనంతగా నలిగిపోయింది! కట్టుకున్న చీరె, చెవులకున్న దుద్దులు పోల్చుకున్నాడు.

నడుం నుండి క్రిందభాగం రక్తం వరద లయింది.

ఏ వత్తిడి వల్లనో ప్రక్కగా ఏడు నెలల పిండం రక్తం ముద్దగా పడి వుంది.

పద్దెనిమిదేళ్ళ సుధాకర్ కళ్ళు తిరిగి పడిపోయాడు. లక్ష ముప్పైవేల బస్‌లో పనికొచ్చే భాగం ఒక్కటిలేదు. రోడ్డుకు ప్రక్కగా ఒరిగి వున్న లేలెండ్ ఇంజను పనికిరాదు. సుబ్బారావు, శామ్యూల్ అక్కడి కక్కడే మరణించారు. లారీ కేబిన్‌లో డ్రైవరు, క్లీనరు యిద్దరూ పోయారు. షుమారు ఓ యిరవయిమంద పోయారు. ఇరవై అయిదు మంది తీవ్రంగా గాయపడ్డారు. వాటిలో ఓ ఎనిమిది మంది స్థితి మరీ ప్రమాదకరంగా వుంది.

ఆర్. టి. సి. సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లు చకచక జరుగుతున్నయ్. శవాలను పోస్టుమార్టంకు గుంటూరు జనరల్ హాస్పిటల్‌కు పంపారు, అక్కడ బంధువులకు ఒప్పజెబుతారు.

గాయపడినవారిని వారి స్థితినిబట్టి కొంత మందిని గుంటూరు జనరల్ హాస్పిటల్‌కు, మరికొంతమందిని దగ్గరలోనున్న హాస్పిటల్‌కు పంపారు.

క్రేన్ తెప్పించి బస్సు, లారీని రోడ్డుమీద నుంచి తీయించాలి. ముందు ఎంక్వయిరీ జరగాలి.

* * *

గుంటూరు జనరల్ హాస్పిటల్ కాజుయాలిటీ, మార్చువరీవద్ద ఏక్సిడెంట్‌లో పోయిన వారి, గాయపడినవారి బంధువులు, స్నేహితులు గుమిగూడారు.

శ్రీనివాసమూర్తి శవం వచ్చింది.

తమకు తల కొరివి పెట్టవలసినవాడికి, తానే తల కొరివి పెట్టవలసి వచ్చింది పరంధామయ్యకు. సీతమ్మగారు ఆ నలిగిన తలను ఒళ్ళో పెట్టుకొని పిచ్చిగా చూస్తూంది.

ఆర్. టి. సి. స్టాఫ్ అందరి కళ్ళల్లో నీళ్ళు!


ఫైనాన్స్ మినిస్టరుగారు విషయం తెలిసి కారులో భార్యతో వచ్చారు. తమ హోదానంతా మరిచిపోయి చిన్నపిల్లవాడిలా ఏడ్చేస్తున్నారు.

సుధాకర్‌కి షాక్‌తో మాట రావటం లేదు. అమ్మ, నాన్న, బావ్మలకు ఏం చెప్పాలి? కోటేశ్వర్రావు అలా మ్రాన్పడిపోయాడు. శ్రీకాంత్ రెండు కాళ్ళు తొడలవరకు తీసేశారు.

క్రచెస్‌తో కుంటుకుంటూ శ్రీకాంత్ కళ్ళు మూసుకున్నాడు. కన్నీళ్ళు ధారాపాతంగా కారుతున్నయ్.

నళిని తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటున్నారు. చీఫ్ మినిస్టరుగారు విజయవాడలో వున్నారు. విషయం విని హుటాహుటి వచ్చారు. అందర్నీ సానుభూతితో పరామర్శించారు. చనిపోయినవారి కుటుంబాలకు రెండు వేలు, గాయపడినవారికి ఐదువందలు సహాయం మంజూరు చేశారు.






* * *

ఎక్సిడెంట్ గురించి డిపార్టుమెంట్ ఎంక్వయిరీ జరిగింది. ఆర్. టి. సి. జనరల్ మానేజర్, ఆ ఏరియా ఆర్. టి. ఓ. బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు, ఏక్సిడెంట్ స్పాట్ చూశారు.

ఎక్స్‌ప్రెస్ 'బ్రాండ్ న్యూ' మెకానికల్ ఫైల్యూర్ వుండదు. 'లారీ?' ఆర్. టి. ఓ గారు ఆదేశాన్ననుసరించి ఏవో రికార్డ్సు వెరిఫై చేశారు ఇన్‌స్పెక్టర్లు.

"ఇంకా పీరియాడికల్ ఇన్‌స్పెక్షన్ జరగలేదండి. టైముకూడా దాటింది."

"ఆల్‌రైట్! డ్రైవరేమన్నా తాగుంటాడా? సరే-బ్రేక్ ఫెయిల్ కావటం కారణం కావచ్చు" ఆర్. టి. ఓ. గారు తేల్చేశారు.

ఎంక్వయిరీ పూర్తయింది. క్రేన్ వచ్చి రోడ్ క్లియర్ చేసింది. అంతా కార్లు ఎక్కారు.

కానీ యింత ఘాతుకానికి కారణం ఎవరు?

"బ్రేక్స్ సరిగా వున్నవి-నా లోపం లేదు" అని సాక్ష్యం ఇవ్వడానికి లేలెండ్‌కు నోరు లేదు.

"సారాయి దిట్టంగా పట్టించి, టర్నింగ్‌లో కాషన్ ఇవ్వక నిర్లక్ష్యం చేసి, ఎదురెదురుగా లైట్లు వెలుగుతూ, ఆరుతున్నా లెక్కచేయక, అదే స్పీడులో టర్నింగ్ కట్‌చేసి, నిషాలో కుడివయిపు మార్జిన్‌కు ఎక్కువ వచ్చి ఏక్సిడెంట్ చేశా"నని బ్రతికున్నా—మస్తాను చెప్పేవాడు కాదు.

"ఓవర్‌స్పీడ్ పోతున్నావ్ - హెయిర్‌పిన్ బెండ్ స్లో చెయ్ గురూ! అరె! ఎదురుగా ఎక్స్‌ప్రెస్. బ్రేక్ తొక్కు!" అని అరిచి చెప్పానని సాక్ష్యం ఇవ్వటానికి క్లీనర్ ఈ లోకంలో లేడు.

అర్ధరాత్రి జరిగిన ఆ ఎక్సిడెంట్‌కు కారణం ఎన్ని ఎంక్వయిరీలు జరిపినా ఎవరికి తెలుస్తుంది?

ఒక్కని అజాగ్రత్తవల్ల ఎన్ని నిండు ప్రాణాలు? ఎందరి భవిష్యత్తు నాశనమయింది? ఎప్పటికి బాధ్యత తెలుసుకుంటారు? అసలు తెలుసుకుంటారా! ఏమో? □